


# ముద్దు

**యేసయ్య అపరంజి పాదాలకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యం:** లూకా 22: 49 యేసు- యూదా, నీవు ముద్దుపెట్టుకొని మనుష్యకుమారుని అప్పగించు చున్నావా అని వానితో అనగా.

**ప్రేమను వ్యక్తం చేసే ఒకే ఒక ప్రక్రియ ముద్దు పెట్టడం. మన బిడ్డలను ముద్దాడుటలో ఉండేంత సంతోషం ఇంకెందులో లేదు కదా. ముద్దులో ఎన్ని రకాలు ఉన్నాయో వాక్యంలో నేర్చుకుందాం :**

1. **తండ్రీ పిల్లల రక్త సంబంధపు ముద్దు : ఆది 31:55** తెల్లవారినప్పుడు లాబాను లేచి తన కుమారులను తన కుమార్తెలను ముద్దు పెట్టుకొని వారిని దీవించి బయలుదేరి తన ఊరికి వెళ్లి పోయెను.
2. **తండ్రి తప్పిపోయిన తన కుమారునికి పెట్టే క్షమాపణ ముద్దు : లూకా 15:20** వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వాని మెడ మీదపడి ముద్దు పెట్టుకొనెను.
3. **తల్లిదండ్రులకు వీడ్కోలు ముద్దు : 1 రాజులు 19:20** అతడు ఎడ్లను విడిచి ఏలీయా వెంట పరుగెత్తి నేను పోయి నా తలిదండ్రులను ముద్దుపెట్టుకొని తిరిగి వచ్చి నిన్ను వెంబడించెదనని చెప్పి అతనిని సెలవడుగగా అతడు పోయిరమ్ము, నావలన నీకు నిర్బంధము లేదని చెప్పెను.
4. **ఒకప్పుడు శత్రువులైన అన్నదమ్ముల కలయిక ముద్దు : ఆది 33:4** అప్పుడు ఏశావు అతనిని ఎదుర్కొన పరుగెత్తి అతనిని కౌగలించుకొని అతని మెడమీద పడి ముద్దు పెట్టుకొనెను; వారిద్దరు కన్నీరు విడిచిరి.
5. **అత్త కోడళ్లు విడిపోయే ముద్దు : రూతు 1:14** వారు ఎలుగెత్తి యేడ్వగా ఓర్పా తన అత్తను ముద్దు పెట్టుకొనెను, రూతు ఆమెను హత్తుకొనెను.
6. **భార్యను సంపాదించుకొనే ముద్దు: ఆది 29:10** యాకోబు తన తల్లి సహోదరుడైన లాబాను కుమార్తెయగు రాహేలును, తన తల్లి సహోదరుడగు లాబాను గొఱ్ఱలను చూచినప్పుడు అతడు దగ్గరకు వెళ్లి బావి మీద నుండి రాతిని పొర్లించి తన తల్లి సహోదరుడగు లాబాను గొఱ్ఱలకు నీళ్లు పెట్టెను. యాకోబు రాహేలును ముద్దుపెట్టుకొని యెలుగెత్తి యేడ్చెను.
7. **బంధుత్వపు ముద్దు : ఆది 29:13** లాబాను తన సహోదరి కుమారుడైన యాకోబు సమాచారము వినినప్పుడు అతనిని ఎదుర్కొనుటకు పరుగెత్తికొని వచ్చి అతని కౌగలించి ముద్దు పెట్టుకొని తన యింటికి తోడుకొని పోయెను. అతడు ఈ సంగతులన్నియు లాబానుతో చెప్పెను.
8. **స్నేహపు ముద్దు : 1సమూ 20:41** వాడు వెళ్లిపోయిన వెంటనే దావీదు దక్షిణపు దిక్కునుండి బయటికి వచ్చి మూడు మారులు సాష్టాంగ నమస్కారము చేసిన తరవాత వారు ఒకరినొకరు ముద్దుపెట్టుకొనుచు ఏడ్చుచుండిరి. ఈలా గుండగా దావీదు మరింత బిగ్గరగా ఏడ్చెను.

9. **అపోస్తలునికి వీడ్కోలు ముద్దు : అపో.కా 20:38** పౌలు మెడమీద పడి అతనిని ముద్దు పెట్టుకొని, వారు ఓడ వరకు అతనిని సాగనంపిరి.

10. **ప్రభువు పాదాల చెంత పాపి సమర్పణ ముద్దు: లూకా 7:38** వెనుక తట్టు ఆయన పాదముల యొద్ద నిలువబడి, యేడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములను తడిపి, తన తలవెండ్రుకలతో తుడిచి, **ఆయన పాదములను ముద్దు పెట్టుకొని**, ఆ అత్తరు వాటికి పూసెను.

11. **కృతజ్ఞత ముద్దు : 2 సమూ 19:39** జనులందరును రాజును నది యవతలకు రాగా **రాజు బర్జిల్లయిని ముద్దుపెట్టుకొని దీవించెను**; తరువాత బర్జిల్లయి తన స్థలమునకు వెళ్లిపోయెను.

12. **విశ్వాసుల పవిత్రమైన ముద్దు : 2 కొరింథీ 13:12** పవిత్రమైన ముద్దు పెట్టుకొని యొకరికి ఒకరు వందనములు చేసికొనుడి.

13. **ప్రేమగల ముద్దు : 1 పేతురు 5:13** బబులోనులో మీవలె నేర్పరచబడిన ఆమెయు, నా కుమారుడైన మార్కును, మీకు వందనములు చెప్పుచున్నారు ప్రేమగల ముద్దుతో ఒకనికి ఒకడు వందనములు చేయుడి.

14. **వరుడైన క్రీస్తు వధువు సంఘానికి పెట్టే ప్రేమ ముద్దు: పరమ 1:2** నోటిముద్దులతో అతడు నన్ను ముద్దు పెట్టుకొనును గాక నీ ప్రేమ ద్రాక్షారసముకన్న మధురము.

**ఇలాంటి ప్రేమకు చిహ్నమైన ముద్దును, పవిత్రతకు చిహ్నమైన ముద్దును కొంతమంది తమ స్వార్థం కోసం, ధనం కోసం, మోసగించడం కోసం వాడుతున్నారు. పరిశుద్ధ గ్రంధంలో అలాంటి కొన్ని సందర్భాలను గమనిద్దాం.**

1. **మోసపు ముద్దు – యాకోబు తండ్రియైన ఇస్సాకును మోసగించుటకు పెట్టిన ముద్దు : ఆది 27:27** **అతడు దగ్గరకు వచ్చి అతని ముద్దు పెట్టుకొనెను**. అప్పుడతడు అతని వస్త్రములను వాసనచూచి అతని దీవించి యిట్లనెను. ఇదిగో నా కుమారుని సువాసన యెహోవా దీవించిన చేని సువాసనవలె నున్నది.

2. **కామాంధకారపు ముద్దు – కామంతో విటునికి జారస్త్రీ పెట్టే ముద్దు : సామె 7:13** అది **వానిని పట్టుకొని ముద్దు పెట్టుకొనెను** సిగ్గుమాలిన ముఖము పెట్టుకొని యిట్లనెను

3. **అప్పగించే ముద్దు – ప్రేమను నటిస్తూ యేసుక్రీస్తుని అప్పగించిన ముద్దు: మార్కు 14:44-46** ఆయనను అప్పగించువాడు నేనెవరిని ముద్దు పెట్టుకొందునో ఆయనే (యేసు); ఆయనను పట్టుకొని భద్రముగా కొనిపోవుడని వారికి గురుతు చెప్పియుండెను. వాడు వచ్చి వెంటనే ఆయనయొద్దకు పోయి బోధకుడా అని చెప్పి, **ఆయనను ముద్దు పెట్టుకొనగా** వారు ఆయన మీద పడి ఆయనను పట్టుకొనిరి.

4. **పగవాని ముద్దు : సామె 27:6** మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును **పగవాడు లెక్కలేని ముద్దులుపెట్టును.**

5. **అబ్షాలోము రాజకీయ ముద్దు : 2 సమూ 15:5** మరియు తనకు నమస్కారము చేయుటకై యెవడైనను తన దాపునకు వచ్చినప్పుడు అతడు తన చేయి చాపి అతని పట్టుకొని ముద్దుపెట్టుకొనుచు వచ్చెను.




**6. విగ్రహమునకు ముద్దు: హోషేయ 13:2** ఇప్పుడు వారు పాపము పెంపు చేయుదురు, తమకు తోచినట్టు వెండితో **విగ్రహములను పోతపోయుదురు, అదంతయు పనివారు చేయు పనియే, వాటికి బలులను అర్పించు వారు దూడలను ముద్దు పెట్టుకొనుడని చెప్పుదురు.**

**హెచ్చరిక:**

- **బయలునకు(సాతానుకు) ముద్దు పెట్టకూడదు: 1 రాజులు 19:18** అయినను ఇశ్రాయేలు వారిలో **బయలునకు మోకాళ్లూనకయు, నోటితో వాని ముద్దు పెట్టుకొనకయునుండు** ఏడు వేలమంది నాకు ఇంకను మిగిలియుందురు.
- **దూడకు ముద్దు పెట్టకూడదు : హోషేయా 13:2** ఇప్పుడు వారు పాపము పెంపు చేయుదురు, తమకు తోచినట్టు వెండితో విగ్రహములను పోత పోయుదురు, అదంతయు పనివారు చేయు పనియే, వాటికి బలులను అర్పించువారు. దూడలను ముద్దు పెట్టుకొనుడని చెప్పు దురు.
- **సూర్య చంద్రులకు ముద్దు పెట్టకూడదు : యోబు 31:26,27 సూర్యుడు ప్రకాశించినప్పుడు** నేను అతనినేగాని **చంద్రుడు మిక్కిలి కాంతికలిగి నడచుచుండగా** అతనినే గాని చూచి నా హృదయము రహస్యముగా ప్రేరేపింపబడి వారి తట్టు చూచి **నా నోరు ముద్దు పెట్టిన యెడలను పరమున నున్న దేవుని దృష్టికి నేను వేషధారినవుదును.**

**ముగింపు :**

**కీర్తన 2:12** ఆయన కోపము త్వరగా రగులుకొనును కుమారుని **ముద్దు** పెట్టుకొనుడి; లేని యెడల ఆయన కోపించును అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు. ఆయనను ఆశ్రయించు వారందరు ధన్యులు.

**లూకా 7:45** నీవు నన్ను **ముద్దు పెట్టుకొనలేదు గాని**, నేను లోపలికి వచ్చినప్పటి నుండి యీమె నా పాదములు ముద్దు పెట్టుకొనుట మానలేదు.

పరిసయ్యులలో ఒకడైన సీమోను యేసును తనతో కూడా భోజనము చేయవలెనని తన ఇంటికి ఆహ్వానించి, భోజన పంక్తి లో కూర్చొని ఉన్నప్పుడు, ఆ ఊరిలో ఉన్న ఒక పాపాత్మురాలైన స్త్రీ ఆ విషయం తెలుసుకొని, ఒక బుడ్డిలో అత్తరు తీసుకొని వచ్చి, వెనుక తట్టు ఆయన పాదముల యొద్ద నిలువబడి, ఏడ్చుచు కన్నీళ్లతో ఆయన పాదములను తడిపి, తన తల వెంట్రుకలతో తుడిచి, ఆయన పాదములను ముద్దు పెట్టుకొని, అత్తరు పూసెను.

ఎందుకంటే ఆ స్త్రీ యేసయ్యను విస్తారముగా ప్రేమించింది. కాబట్టే స్త్రీలు అతి ఇష్టంగా ప్రేమించే తల వెంట్రుకలతో యేసయ్య పాదములను తుడిచింది. అంటే ఆమె యేసయ్యను ఇంకా ఎంత ఎక్కువ ప్రేమించిందో అర్థం చేసుకోవచ్చు. అదే పరిసయ్యుడైన సీమోను ఆయన్ని ఎరిగినప్పటికి, ఆయన్ని ప్రేమించలేదు. కాబట్టే ఇంటిలోకి వచ్చిన యేసయ్య పాదములకు నీళ్లు ఇవ్వలేదు. కాని, ఆ స్త్రీ అయితే తన కన్నీళ్లతో యేసయ్య పాదములను కడిగింది.ఇంటిలోనికి వచ్చిన యేసయ్యను సీమోను ముద్దు పెట్టుకోనలేదు.

కాని ఆ స్త్రీ అయితే యేసయ్య ఇంటిలోనికి వచ్చినప్పటి నుండి ఆయన పాదములను ముద్దు పెట్టుకొనుట మానలేదు అని వాక్యములో చెప్పబడి ఉంది. ఇలా ఆమె తన దీన స్థితిని దేవుని యొద్ద చూపించింది. అందుకే యేసయ్య చెప్పారు "ఆమె విస్తారముగా ప్రేమించింది కాబట్టి తన విస్తారమైన పాపములు క్షమించ బడ్డాయి అని". యేసయ్య కి ఆతిధ్యం ఇచ్చి కూడా ఏ మేలు పొందనిది ఈ పరిసయ్యుడైన సీమోను ఒక్కడే. మరి నీ ఇంటిలోని రావడానికి సిద్దంగా ఉన్న యేసయ్య ను (ప్రకటన 3:20 ఇదిగో నేను తలుపు నొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల, నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతోకూడా అతడును భోజనము చేయుదుము) ఆహ్వానించి, ఆయన్ని ప్రేమించడం లేదా? ఆయన్ని ముద్దు పెట్టుకోవడం లేదా? ఒక్కసారి పరీక్షించుకో ప్రియ సహోదరుడా.... సహోదరి....!

**ప్రియ సహోదరుడా ! సహోదరి ! ఇంత వరకు ఎవరెవరికి ఎలాంటి ముద్దులు పెట్టావు.దేవునికి ఎలాంటి ముద్దులు పెడుతున్నావు. నీ ముద్దులకు అర్థం ఏంటి? నిన్ను నీవు ప్రశ్నించుకో, ఎవరిని ముద్దు పెట్టుకున్నా పెట్టుకోకపోయినా, కుమారుని అనగా ప్రభువైన యేసు క్రీస్తును ముద్దు పెట్టుకోవడం మరువకు, లేని యెడల నీవు నశిస్తావు. పెట్టుకుంటే క్షమించబడి రక్షింపబడతావు.**

**యేసు క్రీస్తును పాపాత్మురాలైన స్త్రీ ఏలాగున ప్రేమించిందో, ఏలాగున ఆయన పాదాలచెంత సమర్పించుకొనిందో, ఆయన పాదములపైన అత్తరు పూసి తలవెంట్రుకలతో తుడిచి మానక ముద్దు పెట్టుకొనిందో అలాంటి అవకాశము మనకు ఈ లెంట్ కాలములో 40 రోజులు దేవుని సన్నిధిలో లభిస్తుంది. ఆయన పాద సన్నిధిలో పశ్చాతాప హృదయముతో, తప్పులు ఒప్పుకుంటూ, కన్నీరు కారుస్తూ ఆయన పరిచర్య చేయటమే ఆయనను ముద్దు పెట్టుకోవటం. అట్టి కృపను పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి దయచేయును గాక. ఆమెన్! ఆమెన్! ఆమెన్!**